డేంజర్ జోన్

- జాతీయ రహదారిపై పెందుర్తి వద్ద ప్రమాదకర పరిస్థితి
- ఒకవైపు రోడ్డు పూర్తికాక అనకాపల్లి నుంచి ఒకే దారిలో వాహనాలు
- అకస్మాత్తుగా డివైడర్లు ఎదురవడంతో డ్రైవర్లలో అయోమయం
- పరిహారం విషయంలో చిక్కుముడి వీడక సమస్య జటిలం
- ఆరు నెలల్లో 30 ప్రమాదాలు
- పట్టించుకోని ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు



పెందుర్తి సమీపంలో అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారిపై ప్రమాదకరంగా ఉన్న రోడ్డు

జాతీయ రహదారి.. రెండుగా చీల్చిన ఒకే మార్గంలో ప్రయాణం..అకస్మాత్తుగా ఎదురయ్యే డివైడర్లు ..అంతే అంతా అయోమయం.. క్షణకాలంలో ఘోర ప్రమాదాలు..ఇదీ సమీపంలోని ఆనందపురం-అనకాపల్లి జాతీయ రహదారిపై పెందుర్తి వద్ద పరిస్థితి. రోడ్డు విస్తరణలో భూములు కోల్పోయిన రైతులతో పరిహారం విషయంలో వివాదం.. ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారుల మధ్య సమన్వయ లోపం.. కోర్టుల్లో కేసుల పర్వం .. వెరసి ఈ ప్రాంతం డేంజర్ జోన్‌గా మారింది. ఈ ప్రమాదాల్లో ఎందరో అమాయకులు బలవుతున్నారు. అసలు ఇక్కడి జాతీయ రహదారిపై చిక్కులేంటి? ప్రమాదాలకు కారణాలేంటి అన్న కోణంలో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఆలోచించకపోవడం శోచనీయం.



సేక

ఇటీవల తిరగబడిన అంబులెన్స్ (ఫైల్)



ప్రమాదకరంగా ఉన్న డివైడర్లు

పెందుర్తి: అనకాపల్లి - ఆనందపురం జాతీయ రహదారి విస్తరణలో జాప్యం వాహనదారులకు శాపంగా మారింది. హైవేపై అకస్మాత్తుగా ఎదురవుతున్న సమయంలో డ్రైవర్లు దారి తెలియక తికమక పడడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

అసలేమవుతుంది?

అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారి విస్తరణ సమయంలో పెందుర్తి మండలం కరకవానిపాలెం వెళ్లే మార్గం నుంచి సరిపల్లి వరకు(దాదాపు రెండు కిలోమీటర్లు) రైతుల నుంచి భూముల రణ చేశారు. అయితే ఈ ప్రక్రియలో పరిహారం విషయంలో తమకు తీవ్ర అన్యాయం జరిగిందని రైతులు పలుమార్లు ఆందోళనలు చేశారు. అయినా వారికి న్యాయం జరగకపోవడంతో కోర్టును ఆశ్రయించారు. గత ప్రభుత్వ హయాంలో జిల్లా ఉన్నతాధికారులు చొరవ తీసుకుని రైతులకు వారు ఆశించిన పరిహారం ఇచ్చేందుకు తగిన మార్గదర్శకాలను రూపొందించారు. అయితే జిల్లా అధికారులు ప్రతిపాదించిన పరిహారం విషయంలో జాతీయ రహదారుల అథారిటీకి - జిల్లా అధికారులకు మధ్య వివాదం రాజుకుంది. దీంతో ఒకరిపై ఒకరు కోర్టుకు వెళ్లారు. దీంతో రైతులకు పరిహారం అందజేత, మిగిలి ఉన్న రోడ్డును పూర్తి చేసే ప్రక్రియ నిలిచిపోయింది.

గాల్లో ప్రాణాలు..

రాంపురం సమీపం నుంచి అనకాపల్లి నుంచి ఆనందపురం వెళ్లే మార్గం పూర్తిగా మూసి వేయడంతో రాంపురం నుంచి పెందుర్తి పెద్ద చెరువు వరకు అనకాపల్లి నుంచి వస్తున్న రోడ్డును రెండు భాగాలుగా చేశారు. దీంతో ఇరుకు రోడ్డులో అనకాపల్లి నుంచి వాహనాలు పెందుర్తి మీదుగా ఆనందపురం వైపు వెళ్లాల్సి వస్తోంది. అయితే పెందుర్తి పెద్ద చెరువు వద్ద రోడ్డు సాధారణ స్థితిలో ఉండడంతో అటుగా క్షణకాలంలో మళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అయితే ఇలా వాహనాలను అకస్మాత్తుగా మళ్లించాల్సిన స్థితిలో డ్రైవర్లు అయోమయానికి గురై ఎదురుగా ఉన్న డివైడర్లను ఢీకొని ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఇక్కడ గత ఆరు నెలల వ్యవధిలో దాదాపు 30 ప్రమాదాలు చోటుచేసుకోవడం గమనార్హం. ఇందులో 10 మంది ప్రాణాలు కోల్పోగా.. పదుల సంఖ్యలో క్షతగాత్రులుగా మిగిలిపోయారు.

పట్టించుకునే నాథుడెవరు?

వాస్తవానికి జాతీయ రహదారి పనులు ప్రారంభం నుంచి ఇక్కడ వివాదం ఉంది. దీనిపై **రైతులు కోర్టుకు వెళ్లడంతో దాన్ని పరిష్కరించేం దుకు ఒకరిద్దరు జిల్లా ఉన్నతాధికారు**లు చొరవ **తీసుకున్నారు. అయితే దానిపై కూడా** హైవే అథా**రిటీ అధికారులు జిల్లా అధికారుల ప్రతిపాదనను సమర్థించకపోగా, కోర్టు కేసుల వర**కు వెళ్లారు. **దీంతో సమస్య మరింత జటిలమై రో**డ్డు పనులు **నిలిచిపోయాయి. వాస్తవానికి దీనిపై** ప్రజాప్రతిని**ధులు, ఇతర ఉన్నతాధికారులు చొర**వ తీసుకుని **కేంద్ర పెద్దల దృష్టికి తీసుకువెళితే** సమస్య ఓ **కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.** ఆ దిశగా **ప్రయత్నం చేయాలని ప్రజలు కోరుత**న్నారు.

నిత్యం అప్రమత్తం చేస్తున్నాం



పెందుర్తి పెద్ద చెరువు ప్రాంతంలోని జాతీయ రహదారిపై ఇటీవల ప్రమా**దాలు** పెరగడంతో **పూర్తిస్థాయిలో** ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాం. వాహనదారులను అన్ని విధాలా అప్రమత్తం చేస్తున్నాం. రాంపురం నుంచి పెందుర్తి వరకు ఉన్న రోడ్డులో వాహనదారులు అప్రమత్తంగా ప్రయాణం చేయాలని సూచనలు చేస్తున్నాం.

– ఎస్.నరసింగరాజు, ట్రాఫిక్ ఎస్ఐ, పెందుర్తి

క్లుప్తంగా

వాసవీ మాతకు ప్రత్యేక పూజలు



వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

పరవాడ: శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ప్రత్యేక పూజలు చేశారు. పరవాడలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో జరిగిన పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో కన్యకాపరమేశ్వరి అసోసియేషన్ అధ్యక్షుడు పి.కోటేశ్వరరావు, ప్రతినిధులు శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, శివ, బంగారం తదితరులు పాల్గొన్నారు.

మేహాద్రి రిజర్వాయర్‌లో వ్యక్తి అనుమానాస్పద మృతి



శివరాం మృతదేహం

పెందుర్తి: మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌లో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. గాజువాక నాతయ్యపాలేనికి చెందిన దేవవరపు శివరాం(28) శనివారం మధ్యాహ్నం మేహాద్రి రిజర్వాయర్ వద్దకు వచ్చాడు. తన బంధువులకు ఫోన్ చేసి మేహాద్రి వద్ద బైక్ ఉంది తీసుకోండి అని చెప్పిన తరువాత ఫోన్ లిఫ్ట్ చేయలేదు. కాగా, సాయంత్రం మేహాద్రిలో వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే సీఐ కె.వి సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీశారు. అతడ్ని శివరాంగా గుర్తించి బంధువులకు సమాచారం అందించారు. శివరాం ఆత్మహత్యకు పాల్పడినట్లు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సీఐ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు జరుగుతోంది.

సీఎం సహాయనిధి అందజేత



బాధితుని కుటుంబానికి చెక్కును అందజేస్తున్న ప్రసాద్

పరవాడ: తీవ్ర అనారోగ్యానికి గురైన సబ్బవరపు పైడినాయుడు వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.3.60 లక్షలు మంజూరయ్యాయి. ఆ చెక్కును జనసేన మండల ఇన్‌చార్జి పంచకర్ల ప్రసాద్ బాధిత కుటుంబానికి శనివారం అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, రూరల్ జనసేన పార్టీ కార్యదర్శి బుగిడి రామగోవిందరావు, రెడ్డి శ్రీనివాసరావు, రెడ్డి గోపి, చిరికి లోకేష్, బండారు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్యాకేజింగ్ ఇండస్ట్రీలో చోరీ

సబ్బవరం: మండలంలోని అయ్యన్నపాలెం గ్రామంలోని శ్రీసాయి ప్యాకేజింగ్ ఇండస్ట్రీలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. దొంగలు చొరబడి కంపెనీలోని కటింగ్ మెషీన్ల వీల్స్, ఎలక్ట్రిక్ కేబుల్స్ వంటి విలువైన వస్తువులు తీసుకువెళ్లిపోయారు. దీనిపై ఆ కంపెనీ ఎండీ తుంపాల ఝాన్సీ స్థానిక సబ్బవరం పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. శుక్రవారం రాత్రి కంపెనీ వెనుకభాగం నుంచి తలుపులు విరగ్గొట్టి, దొంగలు చోరీకి పాల్పడ్డారన్నారు. శనివారం ఉదయం యథావిధిగా కంపెనీకి వెళ్లి చూసేసరికి దొంగతనం జరిగిందని గుర్తించామని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్రత్యేక పరీక్షలతో మానసిక వికాసం



విద్యార్థులకు తరగతి నిర్వహిస్తున్న డైట్ అధ్యాపకుడు త్రినాథరావు

సబ్బవరం: విద్యార్థుల్లో మానసిక ఆరోగ్య పరిస్థితులు మెరుగుపరిచేందుకు ప్రత్యేక పరీక్షలు ఎంతగానో దోహదపడతాయని భీమిలి డైట్ అధ్యాపకుడు సారిపల్లి త్రినాథరావు అన్నారు. సబ్బవరం ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన ఏ స్టడీ ఆఫ్ మెంటల్ హెల్త్.. అకడమిక్ ఎచీవ్‌మెంట్ ఆఫ్ సెకండరీ స్కూల్ ఇన్ ఆంధ్రప్రదేశ్‌పై పరీక్షలను శనివారం ఉదయం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 33 ప్రశ్నలతో కూడిన ఈ పరీక్ష విద్యార్థుల్లో మానసిక వికాసానికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్. తిరుపతిరావు, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని పి.రాధాకుమారి తదితరులు పాల్గొన్నారు.

అమ్మో.. గొయ్యి

- రోడ్డు పక్కన పదడుగుల భారీ గుంత
- తరచూ ప్రమాదాలు



మరిశవానిపాలెం చెరువు వద్ద ఏర్పడిన భారీ గుంత

పరవాడ: జాజులవానిపాలెం-కలపాక రహదారిలో మరిశవానిపాలెం చెరువు వద్ద ఏర్పడిన భారీ గుంత ప్రయాణికులను భయపెడుతోంది. సుమారు ఏడెనిమిదేళ్ల క్రితం ఏర్పడిన ఈ గుంతను పూడ్చేందుకు ఆర్ అండ్ బీ అధికారులు కనీస చర్యలు చేపట్టకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ మార్గంలో నిత్యం ఎన్టీపీసీ, హిందూజా, ఫార్మాసిటీ పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులతో పాటు ఉప్పు గల్లీల్లో పనిచేసే కార్మికులు రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రివేళల్లో వీధి దీపాల వెలుగు కూడా లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొత్తవారు ఆ మార్గంలో ప్రయాణించినా, లేదా కాస్త ఆదమరిచినా పది అడుగుల లోతైన గుంతలో పడిపోయే ప్రమాదం ఉందని తెలియజేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సింహాచలం దేవస్థానం భూముల ఆక్రమణ దుర్మార్గం

సిటిజన్స్ రైట్స్ అండ్ రెస్పాన్సిబిలిటీ జాతీయ కన్వీనర్

దెందులూరు : సింహాచలం దేవాలయ భూములను ఆక్రమించుకోవడమే పెద్ద తప్పని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం దానిని సరిదిద్దకపోగా ఆక్రమించుకున్న 12 వేల మంది ఇళ్లను రెగ్యులర్ చేస్తామని తీసుకున్న నిర్ణయం తప్పని సిటిజన్స్ రైట్స్ అండ్ రెస్పాన్సిబిలిటీ జాతీయ కన్వీనర్ చలమల సత్యనారాయణ కూటమి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఏలూరు జిల్లా దెందులూరు మండలం గాలాయగూడెంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ హిందూ దేవదాయ శాఖ పరిధిలో ఉన్న భూములను ఆక్రమించుకున్న వారిలో ముస్లింలు, క్రిస్టియన్లతో పాటు దేవుడిని నమ్మనివారు సైతం ఉంటారని, వారందరూ దేవాలయ భూములు ఆక్రమించుకుంటే అది సరైనదేనని ప్రభుత్వం సమర్థించడం, ఆక్రమణలు రెగ్యులర్ చేస్తానని నిర్ణయం చేయడం తప్పని చెప్పారు. ఏపీ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని వీహెచ్‌పీ జాతీయ నాయకత్వానికి, సనాతన బోర్డుకు, బీజేపీ అధిష్టానానికి, భారత ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి లిఖితపూర్వకంగా, ఈ-మెయిల్, ఫ్యాక్సులోనూ, ఫోన్‌లోనూ ఫిర్యాదు చేస్తామని సత్యనారాయణ అన్నారు. ఈ భూములను ప్రభుత్వం రెగ్యులర్ చేస్తే రాష్ట్రంలో అన్ని దేవాలయ భూములూ ఆక్రమణకు గురవుతాయని, ఇళ్ళ నిర్మాణం జరుగుతుందని, ఇక మన రాష్ట్రంలో గుడులు తప్ప గుడిమాన్యాలు, గుడి భూములు, సాగు ఆదాయాలు, పూజారులు, దేవాలయాల పోషణ, సనాతన ధర్మం మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని, ఈ విధానం ముమ్మాటికీ తప్పేనని ఆయన స్పష్టం చేశారు. ఈ నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే హిందువుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం

- రైల్వేజోన్‌కు నిధులేవి?
- కేంద్రప్రభుత్వం ముందు సీఎం, డిప్యూటీ సీఎం మోకరిల్లుతున్నారు
- ధ్వజమెత్తిన సీపీఐ



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

పెందుర్తి: బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ కూటమి శనివారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని సీపీఐ కార్యవర్గ సభ్యుడు ఆర్.శ్రీనివాస్ ఆరోపించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్యులకు శాపంగా.. కార్పొరేట్లకు వరంగా ఉందని ఆక్షేపించారు. సుజాతనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్ర ప్రజల చిరకాలం వాంఛ అయిన విశాఖ కేంద్రంగా రైల్వే జోన్‌కు ఎలాంటి నిధులు కేటాయించకపోవడం విచారకరమన్నారు. రాష్ట్రానికి అన్యాయం జరిగిన తీరుపై కూటమిలో భాగస్వాములైన టీడీపీ, జనసేన ప్రజాప్రతినిధులు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వద్ద సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మోకరిల్లుతున్నారని విమర్శించారు. టీడీపీ, జనసేన స్వప్రయోజనాలు మానుకుని ప్రజలకు మేలు జరిగేలా కేంద్రంతో పోరాటం చేయాలని హితవు పలికారు. కేంద్రంతో పోరాటం చేసి రాష్ట్ర హక్కులపై నిలదీసి, అవి కార్యరూపం దాల్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఐ నేత వై.రాంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ ప్రతినిధులు ఎన్.అసిరినాయుడు, అన్నపూర్ణ, రమణ, రాము, మిన్నారావు, అరుణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పగిలిన తాటిపూడి పైప్‌లైన్

- పెందుర్తి కూడలిని ముంచెత్తిన నీరు
- నేడు జోన్-8 ప్రాంతంలో నీటి సరఫరాకు అంతరాయం



పైప్‌లైన్ పగిలిపోయిన ప్రాంతం



తాటిపూడి పైప్‌లైన్ పగిలిపోవడంతో రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

పెందుర్తి : జీవీఎంసీ జోన్-8 ప్రాంతంలో ప్రజలకు తాగునీటిని అందిస్తున్న తాటిపూడి పైప్‌లైన్ మరమ్మతులకు గురైంది. పెందుర్తి మహిళా ప్రగతి కేంద్రం సమీపంలో బీఆర్‌టీఎస్ రోడ్డులో ఉన్న పైప్‌లైన్ శనివారం మధ్యాహ్నం పగిలిపోయింది. దీంతో నీరంతా బీఆర్‌టీఎస్ రహదారిపై దాదాపు కిలోమీటరు మేర రోడ్డుపై ప్రవహించింది. పెందుర్తి పాత ప్రభుత్వాసుపత్రి, పెందుర్తి కూడలి నీటితో నిండిపోయి చెరువును తలపించింది. అటు ప్రయాణం చేసిన వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. తాటిపూడి పైప్‌లైన్ సమీపంలోని ఇళ్లల్లోకి నీరు చొరబడింది.

యుద్ధప్రాతిపదికన మరమ్మతులు: సమాచారం అందుకున్న జీవీఎంసీ మంచినీటి సరఫరా విభాగం అధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు ప్రారంభించారు. జేసీబీ సహాయంతో లీకేజీ గురైన ప్రాంతాన్ని తవ్వి పైప్‌లైన్ మరమ్మతులు చేపడుతున్నారు. రాత్రి పొద్దుపోయే వరకు పనులు జరుగుతున్నాయి.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

కృష్ణాపురం హెడ్ వాటర్ వర్క్స్ ట్యాంక్‌కు నీటిని అందించే తాటిపూడి ప్రధాన పైప్‌లైన్ పాడవడంతో ఆదివారం ఉదయం నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని జీవీఎంసీ మంచినీటి సరఫరా విభాగం ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ వీరయ్య తెలిపారు. 93వ వార్డు(భాగం) నుంచి 98వ వార్డు పరిధిలో ఉన్న సాయిదుర్గానగర్, దుర్గానగర్, అప్పలనరసింహంకాలనీ, లక్ష్మీపురం, పోర్టుకాలనీ, రామ కో ఆపరేటివ్ కాలనీ, హెచ్‌బీ కాలనీ, గోకుల్‌దాం కాలనీ, రెల్లి వీధి, కృష్ణరాయపురం,గొల్లవిల్లివానిపాలెం,ఎల్‌ఐసీ కాలనీ సుజాతనగర్, పాపయ్యరాజుపాలెం,పెందుర్తి పాతూరు,తెలకల వీధి, పెందుర్తి హైస్కూల్ ప్రాంతం, ప్రశాంతినగర్, క్రాంతినగర్, వుడాకాలనీ, రైల్వే కాలనీ, సావిత్రినగర్, అప్పన్నపాలెం, సింహపురిలేవుట్, అడవివరం, ఎస్‌సీ కాలనీ, పాత అడవివరంప్రాంతాల్లో మంచినీటి సరఫరా ఉండదన్నారు.ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామన్నారు.

కల్యాణమండపాల లీజు ప్రక్రియ రద్దు చేయాలి



తొలిపావంచా వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

సింహాచలం: సింహగిరిపై కల్యాణమండపాల నిర్వహణ కోసం లీజుకు ఇచ్చే ప్రక్రియను దేవస్థానం పూర్తిగా రద్దు చేయాలని విశ్వహిందూ పరిషత్ డిమాండ్ చేసింది. వేలం పాటలు పెట్టడం ద్వారా కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా దోపిడీకి పాల్పడుతున్నారని విమర్శించారు. సింహాచలంలోని కొండదిగువ శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి తొలిపావంచా వద్ద వీహెచ్‌పీ నాయకులు శనివారం ధర్నా నిర్వహించారు. కల్యాణమండపాల నిర్వహణను దేవస్థానం కాంట్రాక్టర్‌కు లీజుకు ఇవ్వడం వల్ల, కాంట్రాక్టర్లు రేట్లు పెంచేసి దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. దీంతో పేద, మధ్యతరగతి వారు అక్కడ వివాహాలు చేసుకోలేని పరిస్థితి నెలకుందన్నారు. ఇంత జరుగుతున్నా దేవస్థానం అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే లీజు పద్ధతిని దేవస్థానం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఈ నెల 3న నిరాహార దీక్ష చేస్తామన్నారు. లీజు హక్కు కాలపరిమితి ముగిసినా, అదే కాంట్రాక్టర్‌కు మళ్లీ లీజుకు ఇచ్చే యోచన ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దీనిపై ఈవో దృష్టి సారించి, వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. వీహెచ్‌పీ నాయకులు పూడిపెద్ది శర్మ, మాధవీలత, ఫణి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో శనివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30గంటల నుంచి నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను కొలువుదీర్చి, కల్యాణమహోత్సవం జరిపించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

ఘనంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం గరుడసేవ ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో ఉదయం ఈ సేవ నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వెండి గరుడవాహనంపై ఆశీనులను చేసి, అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. హారతి అందజేశారు. పూజలో పాల్గొన్న భక్తులతో గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

సీఐటీయూ నాయకుల అరెస్ట్ దుర్మార్గం

పరవాడ: వేతనాలు పెంచాలని అధిస్తాన్ పరిశ్రమలో బ్రాండిక్స్-1, 3 కార్మికులు చేస్తున్న ఆందోళనకు మద్దతుగా వెళ్లిన సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులను అరెస్ట్ చేయడం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గనిశెట్టి సత్యనారాయణ పేర్కొన్నారు. వారి అరెస్ట్‌ను తీవ్రంగా ఖండించారు. కార్మికులకు వేతనాలు పెంచాలని, వారి న్యాయమైన కోర్కెలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు మద్దతుగా నిలిచిన సీఐటీయూ నాయకులు కె.సోమునాయుడు, చింతకాయల శివాజీ, చలపతిలను వెంటనే విడుదల చేయాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.

తొమ్మిదైనా తొలగని మంచుతెర



పెందుర్తి పరిసర ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 గంటలకు కూడా దట్టంగా కురుస్తున్న పొగమంచు



మంచు ముసుగు తీయట్లేదు.. పగటిపూట ఉష్ణోగ్రతలు మారినా రాత్రి నుంచి ఉదయం పొద్దు పొడిచినా మంచుతెర కమ్ముకునే ఉంటుంది. దీంతో రోడ్లపై ప్రయాణం చేస్తున్న వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మరోవైపు నిత్యం పొగమంచు కురవడంతో పూతదశలో ఉన్న జీడిమామిడి పూత మాడిపోతోంది. అడవివరంలోనూ ఇదే పరిస్థితి కనిపించింది. ఎటుచూసినా మంచే కనిపించింది. సింహగిరి టోల్‌గేట్ ఘుఖద్వారం ప్రాంతం, పాత అడవివరం వెళ్లే మార్గం తదితర ప్రాంతాల్లో పెద్దఎత్తున పొగమంచు ఉంది. వాహనదారులు లైట్లు వేసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకుంది.

– పెందుర్తి / సింహాచలం



అడవివరం బీఆర్‌టీఎస్ రోడ్డులో పొగమంచు



టోల్‌గేట్ ఏరియాలో పొగమంచు

వెంకన్నకు ప్రత్యేక పూజలు

పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేంకటేశ్వరస్వామికి ఉదయాన్నే సుప్రభాత సేవ, ఆరాధన, బాలభోగం చేశారు. అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, రాజభోగం అనంతరం సర్వ దర్శనాలు కల్పించారు. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు.